# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 06-03-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ ఆంధ్రప్రదేశ్ కు అండగా నిలిచేందుకు 2024-25 కేంద్ర బడ్జెట్ తో పాటు ఇటీవలే ప్రవేశ పెట్టిన బడ్జెట్ లో కేటాయింపులు చేశామని కేంద్ర ఆర్ధిక మంత్రి నిర్మలా సీతా రామన్ పేర్కొన్నారు.
- ❖ పిల్లల్లో విద్యాపరంగా ఒత్తిడిని తగ్గించేందుకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి నారా లోకేష్ వెల్లడించారు.
- ❖ పదవ తరగతి వరకు తెలుగు మాధ్యమంలో విద్యా భోదన జరగాలని పూర్వ ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్యనాయుడు అన్నారు.
- ❖ జాతీయ లోక్ అదాలత్ లో పరిస్కారమయ్యే కేసులు సుప్రీం కోర్టు తీర్పుతో సమానమని అనంతపురం జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.శ్రీనివాస్ తెలిపారు.

==========================

ఆంధ్రప్రదేశ్ కు అండగా నిలిచేందుకు 2024-25 కేంద్ర బడ్జెట్ తో పాటు ఇటీవలే ప్రవేశ పెట్టిన బడ్జెట్ లో కేటాయింపులు చేశామని కేంద్ర ఆర్ధిక శాఖ మంత్రి నిర్మలా సీతా రామన్ పేర్కొన్నారు. ఈ రోజు విశాఖపట్నంలో 2025-26 కేంద్ర బడ్జెట్ పై నిర్వహించిన చర్చా గోష్ఠిలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాత్రికేయులతో కేంద్రమంత్రి మాట్లాడుతూ... జులై 2024 బడ్జెట్ లో పేర్కొన్న విధంగా ఆంధ్రప్రదేశ్ కు అందించే సహకారం కొనసాగుతోందని తెలిపారు. పోలవరం, ఇతర ప్రాజెక్టులకు కేటాయింపులు అందుతున్నాయని స్పష్టం చేశారు. ఈ బడ్జెట్ లో విశాఖ ఉక్కు కర్మాగారానికి అండగా నిలబడేందుకు అధిక మొత్తాన్ని కేటాయించామన్నారు. అంతే కాకుండా, బాంకుల ద్వారా ఆర్ధిక సహకారానికి, ఇతర వ్యవస్థల నుండి సహకారానికి కేంద్రం చొరవ తీసుకుందని తెలిపారు. ఇండస్ట్రియల్ ఎకనామిక్ కారిడార్ లో భాగంగా గత బడ్జెట్ లో ప్రకటించిన కొప్పర్తి, ఓర్వకల్లు పారిశ్రామిక నగరాలను అభివృద్ధి చేస్తున్నామని నిర్మలా సీతారామన్ పేర్కొంటూ...

(వాయిస్ 38 సెకన్లు)

==========================

అభివృద్ధికి అవకాశం ఉన్న వాటిపై ఎక్కువ దృష్టి పెడితే మరింతగా రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని పూర్వ ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్య నాయుడు పేర్కొన్నారు. విశాఖపట్నంలో గీతం విశ్వవిద్యాలయంలో ఈ రోజు జరిగిన ఒక పుస్తకావిష్కారణ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. మాతృ భాషను రక్షించుకోవాలని పిలుపునిచ్చారు. పదవ తరగతి వరకు తెలుగు మాధ్యమంలో విద్యా భోదన జరగాలని సూచించారు. తెలుగులోనే ప్రభుత్వ ఉత్తర ప్రత్యుత్తరాలు జరగాలని వెంకయ్య నాయుడు అభిప్రాయం వ్యక్తం చేస్తూ...

(వాయిస్ 32 సెకన్లు)

==========================

జాతీయ లోక్ అదాలత్ లో పరిష్కారమయ్యే కేసులు సుప్రీం కోర్టు తీర్పుతో సమానమని అనంతపురం జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ రోజు ఆయన జిల్లా కోర్టు ఆవరణలో పాత్రికేయులతో మాట్లాడుతూ.... ఈ నెల 8వ తేదీన జాతీయ లోక్ అదాలత్ ను సుప్రీం కోర్ట్ ఆదేశాలతో నిర్వహిస్తున్నామని, ఈ మేరకు ఉమ్మడి అనంతపురం జిల్లా లోని అన్ని న్యాయ స్థానాలో బెంచ్ లను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. లోక్ అదాలత్ లో రాజీ చేసుకునే సివిల్ కేసుల్లో కోర్టుకు చెల్లించిన రుసు తిరిగి ఇవ్వడం జరుగుతుందని అన్నారు. రాజీ మార్గమే రాజమార్గమని, సత్వర న్యాయం పొందేందుకు జాతీయ లోక్దలత్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు.

==========================

ప్రపంచ చరిత్ర పుస్తకావిష్కరణ చేయడం ఆనందదాయకమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. విశాఖపట్నంలో ఈ రోజు ప్రపంచ చరిత్ర పుస్తకాన్ని పూర్వ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, కేంద్ర మంత్రి నిర్మలా సీతా రామన్ తో కలసి ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. ప్రపంచ చరిత్ర పుస్తకంలో ఆది నుంచి ఇప్పటి వరకు మొత్తం వివరాలను పొందుపరిచడం ఆకట్టుకుందన్నారు.

విరామం

==========================

పిల్లల్లో విద్యాపరంగా ఒత్తిడి తగ్గించేందుకు చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర విద్యా శాఖా మంత్రి నారా లోకేష్ వెల్లడించారు. ఈ రోజు శాసనమండలిలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానం ఇచ్చారు. పలు సమస్యల పిల్లలు విద్యాసంస్థల్లో పిల్లలు బలవన్మరణాలకు పాల్పడటం బాధాకరమని, వీటి నివారణకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మంత్రి తెలిపారు. ఇంటర్మీడియట్ బోర్డులో సంస్కరణలు తీసుకువస్తున్నామన్నారు. ప్రభుత్వ విద్యా సంస్థల్లో మౌలిక వసతులు, బోధన సిబ్బందిని పెంచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని నారా లోకేష్ పేర్కొంటూ....

(వాయిస్ 40 సెకన్లు)

==========================

తపాలా శాఖ అందిస్తున్న కొరియర్ సేవల ద్వారా విదేశాలకు పట్టు దుస్తులను పంపుతూ స్వయం ఉపాధి పొందుతున్న తిరుపతి జిల్లాకు చెందిన ఉషాక్రాంతికి తిరుపతిలోన నారీశక్తి పురస్కారాన్ని జిల్లా తపాలాశాఖ డిప్యూటీ సూపరింటెండెంట్ బి.ఎన్.వసంత ఈ రోజు అందజేశారు. కేంద్రప్రభుత్వం సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల పథకంలో నమోదు చేసుకున్న తిరుపతి జిల్లా పాకాలకు చెందిన ఉషాక్రాంతి “బేబీ పట్టు” సంస్థ పేరుతో చిన్నతరహా పరిశ్రమను నెలకొల్పి దేశ, విదేశాలకు తపాలా శాఖ సేవల ద్వారా పట్టు వస్త్రాలు విక్రయిస్తున్నారు. ఈ పరిశ్రమలో సుమారు 35 మంది మహిళలకు ఉపాధిని కూడా కల్పిస్తున్నారు. ఈ సందర్భంగా ఉషాక్రాంతి ఆకాశవాణితో మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వ సహకారంతో విదేశాలకు పట్టు వస్త్రాలను పంపుతూ యువ పారిశ్రామికవేత్తగా విజయం సాధించామని అన్నారు.

(వాయిస్ 30 సెకన్లు)

==========================

పేదరికం లేని సమాజం లక్ష్యంగా ప్రభుత్వ, ప్రైవేటు ప్రజల భాగస్వామ్యం (పి4) సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ అధికారులను ఆదేశించారు. ఈ రోజు కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా వివిధ విభాగాల అధికారులకు దృశ్య మాధ్యమ విదానంలో పీ4 సర్వేపై శిక్షణ కార్యక్రమమం నిర్వహించారు. ఈ సందర్బంగా ఆమె మాట్లాడుతూ... పేదలకు ఆర్థిక సాధికారత చేకూర్చడం, జీవన ప్రమాణాల్లో అట్టడుగు స్థాయిలో గల 20 శాతం మంది నిరుపేదలను గుర్తించడం ద్వారా పేదరికాన్ని దూరం చేయడం పీ4 విధాన లక్ష్యమని వివరించారు. దీని సాధనకు ఈనెల 8 నుంచి 28వ తేదీ వరకు సర్వే చేయాలని సూచించారు. ఆయా కుటుంబాలు ప్రస్తుతం అందుకుంటున్న పథకాలపై ఈ సర్వే ఎలాంటి ప్రభావం చూపదని స్పష్టం చేశారు. కుటుంబ వివరాలతో పాటు వివిధ సామాజిక, ఆర్థిక పరిమితులతో కచ్చితమైన సమాచారాన్ని యాప్‌లో పొందుపరచిన 27 ప్రశ్నల ద్వారా సేకరించాలని ఆదేశించారు.

==========================

ఏలూరు జిల్లా చోదిమెళ్ల వద్ద ఈ రోజు ఒక లారీని ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ఢీకొట్టిన ప్రమాదంలో నలుగురు మృతి చెందారు. ఈ ప్రమాదంలో సుమారు 13 మందికి గాయాలయ్యాయి. బస్సు హైదరాబాద్ నుంచి కాకినాడ వెళ్తుండగా ఈ ఘటన చోటు చేసుకుంది. ప్రమాదం ధాటికి బస్సు తీవ్రంగా దెబ్బతింది. క్షతగాత్రులను సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. ఘటనాస్థలంలో ముగ్గురు మృతిచెందగా.. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ డ్రైవర్ కన్నుమూశారు. క్షతగాత్రులను ఏలూరు జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి పరామర్శించి బాధితులకు అందుతున్న చికిత్సపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. రోడ్డు ప్రమాదంపై మంత్రులు కొలుసు పార్థసారథి, నాదెండ్ల మనోహర్, ఎంపీ మహేశ్‌యాదవ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి నాదెండ్ల మనోహర్ హామీ ఇచ్చారు.

==========================

పార్వతీపురం మన్యం జిల్లాలో ఈ వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు.

==========================
==========================